
# తమస్సులో...



'ఆంధ్రభూమి' మాస పత్రిక . . . జనవరి, 1995

ఏ.పి. ఎక్స్‌ప్రెస్ భోపాల్ దాటింది.

నెక్స్ట్‌హాల్ట్ నాగపూర్! ఈలోగా ఇంకెక్కడా ఆగదు.

ఆ నిశీథిలో ప్రయాణికులు పల్చగావున్న ఆ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణిస్తున్న మురళీకృష్ణ మనసులో మధురస్మృతులు మెదిలాయి.

ఆ 'మరువలేని, మరపురాని, మధురమైన సంఘటన' జరిగి పదినెలలు దాటింది!

●

అప్పుడూ తాను ఏ.పి. ఎక్స్‌ప్రెస్‌లోనే ఢిల్లీ నుంచి హైదరాబాద్ వస్తున్నాడు.

అయితే... ఆనాడు అది పండువెన్నెల రాత్రి! అందులోనూ వర్షాకాలం అంతమై శీతాకాలం ప్రారంభమవుతున్న శరదృతువు! పుచ్చపూవు వంటి వెన్నెల వింతవింత అందాల్ని పరుస్తుంటే చల్లని పిల్లవాయువులు చిరుచలిని కల్పిస్తూ మనసుకీ, దేహానికీ కూడా చక్కిలిగింతలు పెడ్తున్నట్లుగా వుంది.

ఆరోజు రాఖీ పౌర్ణమి!

ఉత్తరాది వారెవరూ తప్పనిసరి అయితే తప్ప ప్రయాణం చేయరు. అందుచేత ఎప్పుడూ లేనిది ఆరోజున ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్‌లో జనం బాగా తక్కువగా ఉన్నారు. పెట్టెలన్నింటిలోనూ ప్రయాణికులు అక్కడొకరూ, అక్కడొకరూ కనిపిస్తూ అక్కడక్కడ వెంట్రుక పరకలున్న బట్టతలనీ, పళ్ళు చాలా ఊడిపోయిన నోటినీ జ్ఞప్తికి తెస్తున్నాయి.

భోపాల్ వచ్చేసరికి ఆ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లోని జనంలో ఒక్కరు తప్ప అందరూ దిగిపోయారు.

మిగిలిన ఆ ఒక్కరూ... ఒక యువతి!

కూపేలో ఒక్కర్తే బిక్కుబిక్కుమంటూ కూర్చొని ఉంది. కూపేకి ఆనుకునే మురళీకృష్ణ సీటుంది. ఒక్కడూ ఉండడంతో విసుగ్గా వుంది. మిగిలిన ఆ ఒక్క పాసెంజరూ పురుషుడై వుంటే బాగుండేది. కాసేపు పిచ్చాపాటి మాట్లాడుతూ కాలక్షేపం చేయవచ్చు. తాను చనువు తీసుకుని ఆమెను పలకరిస్తే ఆమె అపార్థం చేసుకోవచ్చు. నిర్మానుష్యంగా వున్న ఆ బోగీలో ఒంటరిగా వున్న తనను బలవంతం చేయబోయినట్లు ఊహించుకుని లేనిపోని అల్లరి చేయవచ్చు. నిజానికి ఆమె అటువంటిది కాకపోవచ్చు.

న్యూఢిల్లీ స్టేషన్లో ఆమె కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కుతున్నప్పుడే గమనించాడు తను.

వయస్సు ముప్పై, ముప్పై అయిదు సంవత్సరాల మధ్య ఉంటుంది. మంచి మేనిఛాయ! వయసు కనిపించనీయని అందం! మొదటి చూపులోనే ఎవరినైనా ఆకర్షించే

రూపం! చదువు, సంస్కారం వున్న మనిషని ఎవరికైనా అనిపిస్తుంది. అయినా కూడా త్వరపడి తనకు తానుగా ఆమెను పలకరిస్తే లేనిపోని తలనొప్పి చుట్టుకోవచ్చు. 'ఆమె తనంతట తానే పలకరిస్తే ఎంత బాగుండును!' అనిపిస్తోంది.

విసుగ్గా కంపార్ట్‌మెంట్‌లో ఈ డోర్ నుంచి ఆ డోర్ వరకు నాలుగైదుసార్లు పచార్లు చేశాడు మురళీకృష్ణ. ఇంతలో... ఆమె కూడా కూపే నుంచి బయటకు వచ్చి విండో దగ్గర నిలబడింది. అదిచూసి నడుస్తున్నవాడు అక్కడినుంచి వెనక్కి తిరగబోయాడు మురళీకృష్ణ.

"ఎక్స్‌క్యూజ్ మీ..." అంటూ పలకరించింది ఆమె.

వెనక్కి తిరిగి "ఎస్ ప్లీజ్!" అన్నాడు మురళీకృష్ణ.

"ఇఫ్ ఐ యామ్ నాట్ మిస్టేకెన్... యూ ఆర్ మిస్టర్ మురళీకృష్ణ... ఫేమస్ డాన్సర్?" అంది.

ఆమెవంక ఒక్కసారి సూటిగా చూసి –

"ఎస్... అఫ్‌కోర్స్!" అన్నాడు.

సాధారణంగా పేరు అడిగినప్పుడు ఆడవారికి సిగ్గు వస్తుంది. ఆ సమయంలో సిగ్గుతో బుగ్గలు ఎరుపెక్కడం మురళీకృష్ణ వంతయింది. పాలనునుపు పచ్చదనంతో మెరిసిపోయే అతని బుగ్గల మీద ఎరుపు కొట్టవచ్చినట్లు కనిపించింది. సిగ్గునుంచి తేరుకుని–

"మే ఐ నో యువర్ గుడ్‌నేమ్ ప్లీజ్?" అని అడిగాడు.

"ష్యూర్... నా పేరు ప్రతిమ! మిసెస్ ప్రతిమా జాన్సన్!" అంది ఆమె తెలుగులో.

"మీరు తెలుగువారా!" ఆశ్చర్యంగా ఆమెవంక ఎగాదిగా చూస్తూ అడిగాడు.

"అవును. కాని, ఇండియన్‌ని కాదు. అమెరికాలో సెటిల్ అయిపోయి అక్కడి సిటిజన్‌షిప్ తీసుకున్నదాన్ని. సో... ఐయామ్ యాన్ అమెరికన్!" అంది ఆమె నవ్వుతూ.

"వెరీ ప్లీజ్డ్ టూ మీట్ యూ!" అంటూ అలవాటుగా చేయి ముందుకి చాచి, ఆమె స్త్రీ అన్న విషయం గుర్తుకువచ్చి మళ్ళీ వెనక్కి తీసుకున్నాడు.

"ఐయామ్ ఆల్‌సో వెరీ ప్లీజ్డ్ టూ మీట్ యూ!" అంటూ చొరవగా చేయి ముందుకు చాచి మురళీకృష్ణకి షేక్‌హ్యాండ్ ఇచ్చింది.

ఆమె చొరవకి కొంచెం ఇబ్బందిగా ఫీలయ్యాడు. అదే ఒక పాశ్చాత్య స్త్రీ షేక్‌హ్యాండ్ చేసివుంటే అతనికి ఏమీ అనిపించేది కాదు. కాని, పూర్తి భారతీయ వేషభాషలలో ఉన్న

ఒక స్త్రీతో కరచాలనం చేయడం తనకి ఇబ్బందిగానే అనిపించింది. అది అతని ముఖంలోనూ కనిపించింది.

"మిమ్మల్ని ఎంబరాస్ చేశానా? మాకు అమెరికాలో ఇదంతా కామన్!" అంటూ కొంటెగా నవ్వింది ప్రతిమ.

"అబ్బే... అదేం లేదు!" అంటూ నీళ్లు నమిలి -

"ఎక్కడో అమెరికాలో ఉండే మీరు నన్నెలా గుర్తుపట్టారు?" అన్నాడు మురళీకృష్ణ మాట మార్చే ఉద్దేశంతో.

"రండి, కూపేలో కూర్చుని మాట్లాడుకుందాం! బోగీ అంతా ఇంత బోసిగా ఉంటే నిలబడి మాట్లాడుకోవలసిన ఖర్మేంటి?" అంటూ కూపే వైపు ఒక అడుగువేసింది ప్రతిమ.

మురళీకృష్ణ కొంచెం కంగారుపడి అటూఇటూ చూశాడు.

"మీరేం కంగారుపడకండి... మిమ్మల్నేమీ రేప్ చేయబోవడం లేదు!" అంటూ కిలకిలా నవ్వుతూ లోనికివెళ్లి బెర్త్ మీద కూర్చుంది.

"అమెరికాలో ఆడవాళ్ళు కూడా రేప్ చేస్తారట! అందువల్ల ఆ విషయం మీకే బాగా తెలియాలి!" అంటూ చిరునవ్వుతో చురక అంటించి, తనూ లోనికివెళ్లి ఎదురు బెర్త్ మీద కూర్చున్నాడు.

"అమెరికా అనగానే అభాండాలు వేయడం అందరికీ అలవాటేలెండి! నిజానికి అక్కడ చెడు ఎంతగా ఉన్నా, అంతకుమించి మంచి ఉంది. అదిసరే... ఇండియాలో అందరూ మడికట్టుకు కూర్చున్నవాళ్ళేనా? అవకాశం వస్తే అంతకన్నా ఎక్కువే చేయగలరు. 'వృద్ధనారీ పతివ్రతా' అన్నట్లు- అవకాశాలు వచ్చే అవకాశం బాగా తక్కువగా ఉండడంతో అందరూ బుద్ధిమంతులుగా చెలామణి అయిపోతున్నారు!" అంది ప్రతిమ మరింత కొంటెగా.

ప్రతిమతో మాట్లాడుతుంటే ఒకప్రక్కన వళ్ళు మండుతున్నా, మరోప్రక్కన సరదాగానూ ఉంది, సంభాషణ కొనసాగించాలనీ ఉంది. బోర్ కొడ్తున్న సమయంలో ఆ కాలక్షేపం ఎంతో అవసరం కూడా!

"మీరు చెప్పింది కొంతవరకు నిజమేనని ఒప్పుకుంటాను. మా ఫ్రెండ్ వేణుగోపాల్ అని ఒకతనుండేవాడు. టెలిఫోన్ ఆపరేటర్‌గా చేసేవాడు. ఒక్కొక్కప్పుడు అతనికి నైట్‌డ్యూటీలు పడ్తుండేవి. ఒక్కొక్కప్పుడు మగవాడు అతనొక్కడూ, మిగిలిన ఆడవాళ్ళు ఉండేవారు. అలాంటప్పుడు చూసుకోండీ అతని అవస్థ! ఆడగ్యాంగ్ అంతా చుట్టూ చేరి

అతన్ని నానా అల్లరీ పెట్టేవారు. ఏ మగవాడూ ఏ ఆడదానిని అల్లరి పెట్టనంతగా వేధించేవారట! అతన్ని గురించి పరోక్షంగా ఎకసెక్కాలు చేస్తూ నవ్వుకోవడం సరేసరి! అప్పుడప్పుడు మీదమీదకు కూడా వచ్చి మీసాలు లాగి, కళ్ళజోడు పీకి, షర్టు గుండీలు తెంపి, నానా అల్లరీ చేసేవారట! చివరికి అతనికి నైట్‌డ్యూటీ అంటే బెదురుపుట్టి తానొక్కడే ఉన్న రోజున ఎం.సీ. పెట్టేసేవాడట!"

"మరి, నేను చెప్పింది నిజమేనని ఒప్పుకుంటారా? అవకాశం ఉంది కాబట్టి ఆ అమ్మాయిలు విజృంభించారు. అవకాశం లేనివాళ్ళు బుద్ధిమంతులుగా, పతివ్రతలుగా చలామణి అవుతున్నారు."

"అమ్మాయిలే కాదులెండి! అమ్మలూ, అమ్మమ్మలూ అందరూ కలిసే ఏడిపించే వారట!"

"అదే నేనూ చెప్పేది! ఎదుటివారిని ఆటపట్టించాలనే చిలిపితనం అందరిలోనూ ఉంటుంది. దానికి వయసుతోనూ, సెక్స్‌తోనూ సంబంధం లేదు. పోన్లెండి... మీవాడేమీ రేప్ కాలేదుగా!"

"అంతకన్నా ఎక్కువే అయింది! మావాడు ఎఱ్ఱగా, బుఱ్ఱగా బాగుండేవాడు. అప్పటికి గట్టిగా ఇరవై రెండేళ్లు కూడా లేవు. మాంచి యవ్వనంతో మిసమిసలాడుతుండేవాడు. అదే టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో వీడికి రెట్టింపు వయసున్న సీనియర్ ఆపరేటర్ ఒకావిడ ఉండేది. ఎలా వేసుకుందో వీడిని వలలో వేసుకుంది. అంతకాలం వీడికోసమే కాచుక్కూర్చుందన్నట్లు- ఆమె పెళ్ళి కాకుండానే ఉండింది. నెమ్మదినెమ్మదిగా తారచంద్రుడికి కామపాఠాలు నేర్పినట్లు నేర్పింది. ఏదో 'వీక్‌మూమెంట్లో' మావాడు జారిపోయాడు. అంతే... అంతటి ప్రౌఢ గర్భం దాల్చింది. తనకేమీ తెలియదంటే ఏమయ్యేదో కానీ- వీడు నిజాయితీగా ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. చూసినవారందరూ ముక్కు మీద వేలేసుకోవడమే!"

"వెరీ ఇంట్రెస్టింగ్! జరిగినదానికి ఇద్దరికీ బాధ్యత ఉంటుంది. మీరన్నట్లు తనకేమీ తెలియదని అతను కనుక అనుంటే నేను చాలా అసహ్యించుకునేదాన్ని! కాని, అతను ధైర్యంగా తన బాధ్యతను గుర్తించి పెళ్ళి చేసుకున్నాడంటే... ఎంతైనా అభినందిస్తున్నాను. అతనిది చాలా ఉన్నత వ్యక్తిత్వం అంటాను."

"నిజమే! మామూలుగా అయితే నేనూ మీలాగే అంటాను. కాని, జరిగింది వేరు. ఇద్దరికీ ఏ విషయంలోనూ పోలిక కాని, పొత్తు కానీ లేదు. ఇతను సాంప్రదాయ

కుటుంబానికి చెందిన బ్రాహ్మణుడు. ఆమె హిందూమతాన్ని నిత్యమూ నిరసిస్తూ ప్రచారం చేసే క్రైస్తవ ఫాదరీ కుమార్తె! వీడికి ఇరవై ఏళ్లయితే- ఆవిడకి నలభై దాటాయి. వీడు ఎంతో బాగుంటాడు. అనకూడదు కానీ- ఆమెను చూస్తేనే కడుపు తిప్పుతుంది. అఫ్‌కోర్స్... చూడాల్సింది అతని కళ్ళతో అనుకోండి! పోనీ, ఇదేదో 'ప్రేమ పెళ్ళి' అనీ, 'ఇద్దరూ సుఖంగా గడుపుతున్నారా...' అంటే అదీలేదు. నిత్యమూ అతన్ని ప్రతిదానికీ సాధిస్తూ ఆఫీసులో నలుగురి ముందూ ఇన్‌సల్ట్ చేస్తూనే ఉండేది. దాంతో వీడు ఇంచుమించు పిచ్చివాడిలా అయ్యాడు. నిజాయితీగా బాధ్యత స్వీకరించినందుకు వాడికి కలిగిన ఫలితం ఇది! అందుకే నేను 'నాకు తెలీదంటే ఎలా ఉండేదో?' అని అన్నది. అంతేకాని, చేసిన తప్పుని తప్పించుకోవాలని కాదు. వాడు ఎలాగూ సుఖపడలేదు సరికదా... ఈ పెళ్ళి సంగతి తెలిసి వాళ్ళమ్మ విషం మింగి ఆత్మహత్య చేసుకుంది. తండ్రి మంచంపట్టి మూడు నెలలు తిరక్కుండా పోయాడు. వాళ్ళ కుటుంబం అంతా చిందరవందర అయింది!"

– అంటూ ఆవేశంగా ఏకబిగిన చెప్పుకుపోయాడు మురళీకృష్ణ.

"ఇటీజ్ రియల్లీ ఎ పిటీ! కాని, అతని తల్లి ఆత్మహత్య చేసుకోవడం, తండ్రి మంచంపట్టి చనిపోవడం బాగాలేదు. వాళ్ళు ధైర్యంగా కాంప్రమైజ్ అయ్యుండాల్సింది! చచ్చి వాళ్ళు సాధించిందేముంది? ఫర్ యువర్ ఇన్‌ఫర్‌మేషన్... నేను కూడా సాంప్రదాయ కుటుంబంలోనే పుట్టాను. కాని, పెళ్ళి చేసుకుంది అమెరికన్ క్రిస్టియన్‌ని! మతాల పట్టింపు మాకెవరికీ లేదు. కేవలం మనుషుల్లాగానే బిహేవ్ చేస్తామే కాని, మతం గురించిన ఆలోచన మాకు రాదు. మా పెళ్ళిని మా ఫాదర్ ఈజీగానే తీసుకున్నాడు. కానీ, మా అమ్మ మొదట్లో కొంచెం బాధపడింది. ఆ తర్వాత త్వరలోనే అడ్జస్ట్ అయిపోయింది. అందుకే నేనంటాను- మనం జీవితంతో రాజీ పడాలని! ఆ విధంగా పడగలిగితే చాలా ప్రాబ్లెమ్స్ సాల్వ్ అయిపోతాయి."

"మీవాళ్ళది చాలా ప్రోగ్రెసివ్ ఔట్‌లుక్ అన్నమాట! ఎక్కడ ఉంటారు? మీ ఫాదర్ ఏం చేస్తారు? మీరు వెళ్తోంది వారి దగ్గరకేనా?"

– ప్రశ్నల వర్షం కురిపించాడు మురళీకృష్ణ.

ప్రతిమ ముఖంలో గాంభీర్యం చోటుచేసుకుంది. బరువుగా నిట్టూర్చింది.

"ఇట్సాల్ ఎ బిగ్ ట్రాజెడీ! మా ఫాదర్ మద్రాస్‌లో ఎల్.ఐ.సీ.లో జోనల్ ఆఫీసర్‌గా పనిచేస్తుండేవారు. ఆయనకి మా అన్నయ్య, నేను ఇద్దరమే పిల్లలం! మా అన్న ఇంజనీరింగ్

చదువుతుండేవాడు. నేను ఆడయార్ కళాక్షేత్రలో చదువుకుంటుండేదాన్ని. నాకు చిన్నప్పటి నుంచి భరతనాట్యం అంటే చాలా ఇష్టం!

అందుకనే అక్కడ చేర్పించారు నాన్నగారు.

మిస్టర్ జాన్సన్ 'ఫోర్డ్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్' మీద ఇండియాకి వచ్చి నృత్యరీతులను స్టడీ చేయడానికి మద్రాసు వచ్చారు. ఆ సందర్భంగా ఆయన తరచుగా అడయార్‌కి వస్తుండేవారు. మాకు అక్కడే పరిచయం అయింది. తర్వాత అది ప్రేమగా మారి, ఆ తర్వాత పెళ్ళిగా పరిణమించింది. ఆయన స్టడీస్ పూర్తికాగానే మేము అమెరికా వెళ్లిపోయాం. ఇదంతా అయిదు సంవత్సరాల క్రిందటిమాట!

రెండేళ్లక్రితం మా అమ్మా, నాన్నగారు మమ్మల్ని చూడడానికి అమెరికా వచ్చారు. వారు తిరిగి వెళ్తున్న విమానాన్ని టెర్రరిస్టులు టైంబాంబ్ పెట్టి మధ్యమార్గంలో పేల్చివేశారు. అంతే... ప్రయాణీకులందరితో పాటు వాళ్ళూ బుగ్గి అయిపోయారు!" ప్రతిమ కళ్ళలో నీరు తిరిగి బయటకు రాకుండా ఆగిపోయింది.

"రియల్లీ ట్రాజిక్! అంతటి సంస్కారవంతులు ఆ విధంగా దుర్మరణం చెందడం రియల్లీ బాడ్! ఆఁ... ఇప్పుడు మీ అన్నగారు ఎక్కడున్నారు?" అన్నాడు మురళీకృష్ణ.

"హైదరాబాద్‌లో ఇంజనీర్‌గా ఉన్నాడు. ఇప్పుడు నేను వెళ్తోంది ఆయన్ని చూడడానికే! అక్కడినుంచి కళాక్షేత్రకి కూడా ఓసారి వెళ్లి, ఆ తర్వాత మళ్లీ అమెరికా వెళ్లిపోతాను."

"కళాక్షేత్ర విద్యార్థి కనుక, డాన్స్ అంటే అభిమానం ఉన్నవారు కనుక- నా పేరు తెలిసి నన్ను గుర్తుపట్టారన్నమాట!"

"అంతర్జాతీయ ఖ్యాతి గడించిన మీ పేరు తెలీనిదెవరికి? మీరన్నా, మీ నాట్యం అన్నా నాకు ఎంతో అభిమానం! ఇండియాలో ఉండగా మీ ప్రదర్శనలెన్నో చూశాను."

"సో... నైస్ ఆఫ్ యు! అమెరికాలో మీవారేమి చేస్తున్నారు?"

"మేము పిట్స్‌బర్గ్‌లో ఉంటున్నాం. ఆయన యూనివర్శిటీలో ఫైన్ ఆర్ట్స్ ప్రొఫెసర్. నేను ఒక డాన్స్‌స్కూల్ నడుపుతున్నాను. అందులో మన కూచిపూడి, భరతనాట్యం నేర్పుతున్నాను."

"వెరీఫైన్‌ఔ మీ స్టూడెంట్స్ ఇండియన్సేనా? అమెరికన్స్ కూడా ఉన్నారా?"

"అందరూ ఉన్నారు. నిజం చెప్పాలంటే ఇండియన్స్ కంటే అమెరికన్ స్టూడెంట్స్ ఎక్కువ శ్రద్ధతో నేర్చుకుంటున్నారు. వాళ్ళలో చిత్తశుద్ధీ, నిజాయితీ ఉన్నాయి. డివోటెడ్‌గా

నేర్చుకుంటున్నారు. మనవాళ్ళలో ఎక్కువమంది పెద్దవాళ్ళ బలవంతం మీద చేరి మొక్కుబడిగా నేర్చుకుంటున్నారు."

"సో... మీరు అమెరికాలో ఉండి కూడా ఇండియన్ కల్చర్‌కి సేవచేస్తున్నారన్నమాట! ఇటీజ్ రియల్లీ ప్రైజ్ వర్దీ! ఇప్పుడు ఇండియాకి వచ్చారెందుకు? మీ అన్నగారిని చూడడానికేనా?"

"కాదు. ఢిల్లీలో ట్రెడిషనల్ డాన్స్‌మీద ఇంటర్నేషనల్ సెమినార్ జరిగింది కదా! దాంట్లో పార్టేక్ చేయడానికి వచ్చాను. ఆ సెమినార్‌లో మీరు గెస్ట్ లెక్చర్ ఇచ్చారు కూడా! అక్కడ మిమ్మల్ని చూశాను."

"అవును. నేనూ మిమ్మల్ని గమనించాను... ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది! అదిసరే- మీకెంతమంది పిల్లలు? వాళ్ళేం చేస్తున్నారు? వాళ్ళకీ ఇండియన్ డాన్స్ నేర్పిస్తున్నారా?"

ప్రతిమ ముఖంలో రంగు మారింది.

గొంతు సరిచేసుకుంది...

"అన్నీవున్నా ఏదో ఒక లోటులేని కుటుంబం ప్రపంచంలో ఉండదేమో! మా వైవాహిక జీవితం ఎంతో ఆనందంగా నడుస్తోంది. కాని, ఉన్న లోటల్లా మాకు పిల్లలు లేకపోవడమే! మాకు ఆ యోగ్యత లేదు!" ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"సో సారీ..! అయినా టెస్ట్‌ట్యూబ్ బేబీలు కూడా కామన్ అయిన అమెరికాలో మీ ప్రాబ్లెంకి సొల్యూషన్ దొరకలేదా?"

"సమస్య నాకు కాదు. మాతృత్వం పొందడానికి శారీరకంగా అన్ని అర్హతలూ నాకున్నాయి... లోటున్నది ఆయనలో! ఆయన స్పెర్మ్‌లో జీవకణాలు లేవు. అందుకే తల్లినయ్యే యోగం నాకు లేదు. ఇదే సగటు అమెరికన్ దంపతులైతే విడాకులు తీసుకుని ఉండేవారు. ఆ విషయం ఆయన నాతో అన్నారు కూడా! కానీ, నేను ఆయన్ని వివాహం చేసుకుంది ఆయనలోని వ్యక్తిత్వమంటే ఇష్టపడి! నన్ను తల్లిని చేయగల శక్తి ఆయనలో లేనంతమాత్రాన ఆయనకి డైవోర్స్ ఇవ్వగమేనా?

ఆయన హృదయం ఎంతటి విశాలమైనదో తెలుసా? పిల్లలంటే నాకున్న మోజుని గ్రహించి ఆయన నేను కావాలనుకున్న వ్యక్తితో శారీరక సంబంధం పెట్టుకోమన్నారు. అతనివల్ల కలిగిన సంతానాన్ని సొంతబిడ్డలుగా స్వీకరించి సాకుతానన్నాడు. కానీ, నేనందుకు ఒప్పుకోలేదు. ఆయన వ్యక్తిత్వం సామాన్యుల మేధస్సుకి అందనంతటి ఉన్నతమైంది.

ఈ సమయంలో నాకు మిమ్మల్ని చూస్తుంటే ఒక వింత ఆలోచన వస్తోంది. నా ఆలోచన మీకు విచిత్రంగానూ, పిచ్చిగానూ అనిపించవచ్చు. కాని, ప్రశాంత చిత్తంతో ఆలోచిస్తే అందులో అనౌచిత్యమేమీ కనిపించదు."

"ఏమిటది..?"

"మాత కావాలన్న కోరిక నాలో ఎంత బలంగా ఉన్నా ఆ పుట్టేబిడ్డ గొప్ప కళాకారుడై రాణించాలన్న వాంఛ అంతకన్నా బలంగా ఉంది. అందువల్ల శిశువు కోసం ఇతరులతో శారీరక సంబంధం పెట్టుకుంటే అది కేవలం ఒక గొప్ప కళాకారుడితోనే అవుతుంది. ఆ కళాకారుడు మీరే ఎందుకు కాకూడదు?"

"నేనా..?"

– వీపుమీద కొరడాతో కొట్టినట్లు అదిరిపడ్డాడు మురళీకృష్ణ.

"అవును... మీరే! ప్రశాంతంగా ఆలోచించండి. ఒక వివాహిత యువతి తెగించి సిగ్గువిడిచి ఈ విధంగా కోరడం మీకు ఆశ్చర్యంగా ఉంది కదూ! సహజమే..! కానీ, మీరు నిష్కళంక బ్రహ్మచారులై ఉంటే మిమ్మల్ని అడిగేదాన్ని కాదు. మీరు వివాహితులై వుంటే మీ శీలం చెడగొట్టాలని అనుకునేదాన్ని కాదు. మీగురించి చదివిన ప్రొఫైల్స్ వల్ల మీరు అవివాహితులని తెలుసుకున్నాను. కాని, మీరు స్త్రీసంపర్కం ఎరుగనివారని నేననుకోవడం లేదు. ఎందరో వివాహిత స్త్రీలతో మీకు శారీరక సంబంధం ఉండివుండవచ్చు. నిజానికి ఈ విషయంలో నేను పొరబడి ఉండవచ్చు. కాని, నా భావనే కనుక సరైనదైతే నా కోరిక తీర్చడంలో తప్పేమి వుంది?" దీనంగా అడిగింది ప్రతిమ.

"కానీ... మీలాంటి ఉత్తమురాల్ని..."

"అయినా తప్పు లేదంటాను. నిస్వార్థంగా చేసినదానిని శాస్త్రాలు ఆమోదించాయి. మన మహాభారత గాథనే తీసుకోండి– చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అయోగ్యులు కనుకనే కదా... వ్యాసమహర్షి సంపర్కం కావలసివచ్చింది? పాండురాజు వ్యాధిగ్రస్తుడై అసమర్థుడు అయినందువల్లే కదా... కుంతి ఇతర దేవతల చేత సంతానం పొందింది! నిజానికి ధర్మరాజు, భీముడు, అర్జునుడు కౌంతేయులే కాని, పాండవులు కాదు. అలాగే మాద్రి కూడా అశ్వనీ దేవతల వల్లనే నకుల సహదేవులను పొందింది. వారు మాద్రేయులే కాని, పాండవులు కారు. అయినా తనకి పుట్టకపోయినా పాండురాజు పితృత్వం స్వీకరించాడు కనుక వారందరూ పాండవులుగా చలామణి అయ్యారు. వీటిని శాస్త్రాలూ, సమాజం, పెద్దలూ అందరూ ఆమోదించలేదా? వారిని అగౌరపరచలేదే!"

"మీకు చాలా విషయాలు తెలుసునే!"

"నాకు మన పురాణాలు, ఇతిహాసాల మీద చాలా గౌరవం ఉంది. అలాగే మన భారతీయ సంస్కృతి అన్నా ఎంతో అభిమానం ఉంది. అమెరికాలో స్థిరపడినంత మాత్రాన వీటిని మరచిపోను, కించపరచను. నాకే కాదు– మిస్టర్ జాన్సన్‌కి కూడా వీటన్నిటి మీదా ఎంతో గౌరవం ఉంది."

"మాటవరసకి మీ కోరిక తీర్చాననుకుందాం... కాని, అందువల్ల మీకు గర్భం వచ్చితీరుతుందన్న నమ్మకం లేదే!"

"నిజమే! ఇటీజ్ జస్ట్ టేకింగ్ ఎ ఛాన్స్! గర్భం రావచ్చు.., రాకపోవచ్చు! శారీరకంగా నాలో ఏ లోపమూ లేదు. మానసికంగా మాత కావాలన్న కోరిక బలంగా ఉంది. కోరిక బలంగా ఉంటే శరీరం కూడా అందుకు అనుగుణంగా మారుతుందనీ, ఇష్టకామ్య సిద్ధి కలుగుతుందనీ అంటారు. నా అదృష్టం బాగుండి, నా కలలు పండి మీవల్ల నా కడుపు పండితే గొప్ప కళాకారుడు జన్మించగలడని గర్విస్తాను.

అది జరగకపోతే మీవంటి గొప్ప కళాకారుడితో గడిపిన మధురానుభూతి జన్మంతా మరుపుకు రాకుండా ఉంటుంది. నా కోరికలో స్వార్థం లేదు కనుక, భర్తని మోసగించడం అసలే కాదు కనుక– ఇది పవిత్రమైనది. సర్వసంగ పరిత్యాగులైన ఋషులు కేవలం సంతానం కోసం తమ పత్నులతో కూడేవారు. ఇది బ్రహ్మచర్యంతో సమానమని శాస్త్రాలు పేర్కొన్నాయి. పదహారువేల నూట ఎనిమిదిమంది సతులు ఉన్నా శ్రీకృష్ణుని మహోన్నత బ్రహ్మచారిగా శాస్త్రాలు పేర్కొన్నాయి. మన కాలంలో మహాత్మాగాంధీ, మొరార్జీ దేశాయ్ వంటివారు ఈ విధమైన బ్రహ్మచర్యాన్ని ప్రచారం చేయడమే కాకుండా నిజజీవితంలో ఆచరించారు కూడా! అందువల్ల ఈ పని చేసినందుకు నాకు కాని, మీకు కాని కళంకం అంటదు" అంది ప్రతిమ.

ఆమె మాటలకి ప్రతిమలా ఉండిపోయాడు మురళీకృష్ణ.

తర్వాత తేరుకున్నాక, ఆప్యాయంగా ఆమెవైపు చేతులు చాచాడు.

ప్రతిమ వెంటనే అతని ఒడిలో వాలిపోయింది.

ఆ వెన్నెల రాత్రిలో, ఎవ్వరూ లేని ఆ రైలుపెట్టెలో పంచభూతాల సాక్షిగా వారిద్దరూ శారీరకంగా ఒకటయ్యారు.

తర్వాత హైదరాబాద్ చేరుకున్నాక ఎవరి దారిన వారు వెళ్లారు.

ఈ సంఘటన అంతా కళ్ళముందు మెదిలింది మురళీకృష్ణకు.

ఇప్పుడు ప్రతిమ ఎక్కడుందో..?! ఎలా వుందో..?! ఆమె గర్భం ధరించిందో, లేదో..?! బహుశా ధరించి ఉండదు.

ఆమె అడ్రసు తీసుకోవాలనుకున్నాడు కానీ, మరిచిపోయాడు. కాని, తన అడ్రసు ఆమెకి తెలుసు. ఉత్తరం రాయాలనుకుంటే రాయవచ్చు. బహుశా తాము చేసిన పనికి తర్వాత పశ్చాత్తాపపడి ఉంటుంది. అందుకే పది నెలలైనా ముఖం చెల్లక ఉత్తరం రాయలేదు అనిపించింది. అతనికి కూడా అది మరువలేని మధురానుభూతి.

హైదరాబాద్ చేరేసరికి చాలా టపా అతని కోసం ఎదరుచూస్తోంది.

అందులో అమెరికాలో పోస్టు అయిన ఎయిర్‌మెయిల్ కవరు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఆత్రంగా దానిని తెరిచాడు మురళీకృష్ణ.

అది ప్రతిమ దగ్గర్నుంచే. అందులో –

"పూజ్యులు మురళీకృష్ణగారికి...

తమస్సులో కొట్టుమిట్టాడుతూ పిల్లల కోసం తపస్సు చేస్తున్న నాకు మీరు మగశిశువును అనుగ్రహించారు. ఈ నెల మూడవ తారీఖున బాబు పుట్టాడు. ఇందులో వాడి ఫోటో పంపుతున్నాను. నా ప్రక్కన ఉన్నది మావారని వేరే చెప్పనక్కరలేదు. వీడికి 'కృష్ణకుమార్' అని పేరు పెట్టాం. వీడు మా బిడ్డ కాదు... మన ముగ్గురి బిడ్డ! మిమ్మల్ని మించిన గొప్ప కళాకారుడు కావాలని కోరుకుంటున్నాం. మీ రక్తం పంచుకుని పుట్టి మీ ఆశీస్సులు ఎప్పుడూ పొందే వీడు అంతటివాడు అవుతాడన్న నమ్మకం నాకుంది.

శిశువు జన్మించాకే ఉత్తరం రాయాలన్న ఉద్దేశంతో ఇన్నాళ్లూ రాయలేదు. అన్యధా భావించరని ఆశిస్తున్నాను. మీ క్షేమ సమాచారాలు తరచుగా తెలుపుతుండండి. బాబుని గురించి మీకు ఎప్పటికప్పుడు రాస్తుంటాను.

మిస్టర్ జాన్సన్ మీకు తన శుభాకాంక్షలు తెలుపమన్నారు. త్వరలో ఇండియాకి వచ్చి మన బిడ్డని మీకూ చూపుతాం!"

– అని ఉంది ఆ ఉత్తరంలో.

'ఆంధ్రభూమి' మాస పత్రిక . . . జనవరి, 1995